క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణపై అందరూ దృష్టిసారించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 33, 34 వార్డులలో గురువారం ఆయన పర్యటించారు. ఆయా వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

టూ టౌన్ సీఐగా నిస్సార్ బాషా



తెనాలిరూరల్: తెనాలి టూ టౌన్ సీఐగా నియమితులైన ఎండీ నిస్సార్ బాషా గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన సుధాకర్ ఇటీవల సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న నిస్సార్ బాషా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి టూ టౌన్ సీఐగా నియమితులై ఉదయం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని శావల్యాపురం, తెనాలి వన్‌టౌన్, నాగార్జునసాగర్, నర్సరావుపేట స్టేషన్లలో ఎస్‌ఐగా తాను విధులు నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం సీఐగా పదోన్నతి పొంది సీఐడీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో పని చేయడంతో పాటు గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ విభాగంలో, ప్రత్తిపాడులో సేవలందించినట్లు చెప్పారు. తెనాలిలో ప్రధాన సమస్యల పరిష్కారంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాను సారం శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.

రేపు పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

తెనాలిఅర్బన్: పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు జీవీ.శివరామకృష్ణ, కె.వి.వి. సత్యనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీలు పి.అనురాధ, ఎం.హనుమంతరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఎస్‌.రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారిణి వి.కోటేశ్వరి పాల్గొంటారని చెప్పారు. సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

సీతారాం ఏచూరి సేవలు అమోఘం



రేపల్లె రూరల్/కొల్లూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సేవలు అమోఘమని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మణిలాల్ చెప్పారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సీతారాం సంతాపసభలో ఆయన మాట్లాడారు. ఉద్యమాల్లో సీతారాం చెరగని ముద్ర వేశారని కొనియాడారు. సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు లక్ష్మణరావు, కె.రమేష్, బి.ధర్మరాజు, కె.వెంకట్, యు.రామకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

■ సీతారాం ఏచూరి మృతి విచారకరమని మాల ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. సంతాపం తెలిపిన వారిలో మాల ఉద్యోగుల సంక్షేమ సేవ సంఘ నాయకులు దర్శి భాస్కరరావు, దారం సాంబశివరావు, అంబటి జాకోబ్, కె.రాంబాబు, జి.రవీంద్ర, కృపాకరరావు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

■ కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోతార్లంకలో సీపీఎం కార్యాలయాన్ని సీతారాం ఏచూరి ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరులో మోటూరు హనుమంతరావు విగ్రహం ప్రారంభోత్సవానికి ఆయన వచ్చిన సంగతి చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు బొనిగల సుబ్బారావు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

‘స్కైవాక్’ అంచనాలకు పుష్కర కాలం!!

ఇప్పటికైనా వంతెన నిర్మించేనా?

రేపటి పని ఇవాళే పూర్తిచేయాలని పెద్దలు చెబుతుంటారు. ఎందుకంటే సమయం మనకోసం ఆగదు. అలాగే చేసిన వాగ్దానం అమలు విషయంలో కూడా ఇదే నియమం వర్తిస్తుంది. చిత్తశుద్ధితో దాని అమలుకు నేతలు యత్నించాలి. కానీ తెనాలిలో పుష్కరకాలం నాడు పాలకులు సంకల్పించిన స్కైవాక్ నిర్మాణం ఇవాల్టికీ కార్యరూపం దాల్చలేదు. నాడు హడావిడిగా అంచనాలు, నమూనా చిత్రం రూపొందించినా నేటికీ అవన్నీ కాగితాలపైనే మగ్గిపోతున్నాయి!

- నాడు అంచనాలు తయారు చేయించిన ప్రస్తుత మంత్రి నాదెండ్ల మనోహర్
- రాష్ట్రంలోనే తొలి స్కైవాక్ వంతెన
- 2014 ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం ఫైలును పక్కన పడేసిన వైనం



అధికారులు తయారు చేయించిన స్కైవాక్ వంతెన నమూనా(ఫైల్)

తెనాలిరూరల్: ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాలకే పరిమితమైన స్కైవాక్ వంతెనలు తెనాలిలో నిర్మించాలని 2012లో అప్పుడు శాసనసభ స్పీకరుగా ఉన్న నాదెండ్ల మనోహర్ నిర్ణయించారు. మహానగరాలకే పరిమితమైన స్కైవాక్ వంతెనను రాష్ట్రంలోనే తొలిగా తెనాలి పట్టణంలో నిర్మించేందుకు అప్పట్లో చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై, ముంబయ్ నగరాల్లో ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా పాదచారులు రోడ్డు దాటేందుకు వీలుగా రహదారులపై భారీ ఆకాశ నడక వంతెనలను నిర్మించారు. తెనాలి పట్టణంలో ఇటువంటి వంతెన నిర్మాణానికి సన్నాహాలు చేసిన అధికారులు ఆనక దానికి సంబంధించిన ఫైలును సైతం పక్కన పడేశారు.

పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే మార్కెట్ వంతెన వద్ద, ఇక్కడి మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ కాంప్లెక్సు నుంచి పాత బస్టాండ్ వరకు పడమర, నిజాంపట్నం, తూర్పు కాల్వల మీదుగా వంతెనను నిర్మించేందుకు నిర్ణయించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో అప్పట్లోనే సుమారు రూ. ఐదు కోట్ల అంచనాతో వంతెనను నిర్మించేందుకు కసరత్తులు చేశారు. 100 మీటర్ల పొడవు ఉండే ఈ వంతెన నిర్మాణానికి సంబంధించి సర్వేను పూర్తి చేసి, ప్రాజెక్టు రిపోర్టును తయారు చేశారు. మూడు రోజుల పాటు చేపట్టిన సర్వేలో మార్కెట్ వంతెన వద్ద తెనాలి-గుంటూరు రోడ్డు, తెనాలి-చందోలు రహదారిలో గంటకు 1400 నుంచి 1600 మంది పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారని, ఇదే సంఖ్యలో వస్తున్న వాహనాల రద్దీ కారణంగా పాదచారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడంలేదని సర్వేలో తేలింది. అంతే కాక ముంబయ్, బెంగళూరు నగరాల్లో ఇటువంటి వంతెనలను నిర్మించిన సంస్థ సిబ్బందితో సంప్రదించి వంతెన నిర్మాణానికి సంబంధించిన సలహాలు, సూచనలనూ ఇక్కడి అధికారులు తీసుకున్నారు. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా స్కైవాక్ వంతెన నమూనాను తయారు చేయించారు. తొలిగా రూ. 10 కోట్లతో వంతెనకు ఇరువైపులా ఎస్కలేటర్లతో నిర్మాణం చేపట్టాలని భావించిన అధికారులు పూర్తి సర్వే అనంతరం రూ. ఐదు కోట్లతో పనులు పూర్తి చేయవచ్చన్న నిర్ణయానికి వచ్చారు. కేవలం పాదచారులను దృష్టిలో పెట్టుకుని నిర్మించనున్న ఈ వంతెనకు ఎస్కలేటర్ల స్థానంలో స్టెయిర్‌కేస్, లిఫ్టులు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. పట్టణంలో టౌన్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన నాడు ఇదే విషయాన్ని అధికారులు స్పష్టంగా తెలియజేశారు. పాదచారులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఈ వంతెన ఉపయోగపడుతుందని అప్పట్లో అధికారుల భావన. మార్కెట్ కాంప్లెక్సుతో పాటు మున్సిపల్ కార్యాలయం, మార్కెట్ ఏరియాకు వెళ్లే ప్రజలకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. ఈ వంతెన ఇటు ప్రజలకు ఉపయోగపడడమే కాకుండ, రాష్ట్రంలోనే తొలి వంతెన కావడంతో తెనాలి కీర్తి శిగలో మరో కలికితురాయిగా ఉండిపోయేది. అటువంటిది ఈ వంతెన నిర్మాణాన్ని ప్రస్తుతం మంత్రిగా ఉన్న మనోహర్ తిరిగి చేపట్టి పూర్తి చేయాలని అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

సంబరంగా గణేష్ ఉత్సవాలు



నందులపేటలో అన్నప్రసాద వితరణ చేస్తున్న నిర్వాహకులు



రామలింగేశ్వరపేట రూ.1,21,000లకు లడ్డూ దక్కించుకున్న నాగరాజు కుటుంబ సభ్యులు

తెనాలి: పట్టణ నందులపేటలోని బాలగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నవమ గణపతి మహోత్సవాల్లో భాగంగా గురువారం భారీ సంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లడ్డూ వేలంపాట నిర్వహించారు. అనంతరం స్వామి ఊరేగింపును ఘనంగా జరిపారు. దొప్పలపూడి ప్రసాద్, కంతమనేని మహీధర్, నల్లయ్య, పి.బసవేశ్వరరావు, వి.గోపీకృష్ణ, పి.భరత్, ఎన్.నాగేశ్వరరావు, ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరపేటలో రూ.1,21,000లు పలికిన లడ్డూ

తెనాలిఅర్బన్: వినాయక చవితిని పురస్కరించుకుని రామలింగేశ్వరపేటలోని పుట్టా రాఘవయ్య రైస్ మిల్లు దగ్గర శ్రీ గణేష్ భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమను బుధవారం రాత్రి నిమజ్జనం చేశారు. రామలింగేశ్వరపేటలో ప్రారంభమైన ఊరేగింపు గురవయ్య కాలనీ మీదుగా స్వరాజ్ టాకీస్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడి నుంచి కొత్తవంతెన మీదుగా వీఎస్సార్ కళాశాల వద్ద ఉన్న కాల్వలో ప్రతిమను నిమజ్జనం చేశారు. ముందుగా 17 కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా అదే ప్రాంతానికి చెందిన మైలా నాగరాజు రూ.1,21,000లు చెల్లించి దక్కించుకున్నారు. చిన్న లడ్డూలను భూక్య జగ్గరావు మనోజ్ రూ.75,000లు, కేశంశెట్టి బాలాజీ రూ.75,000లు చెల్లించి సొంతం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ పేరం సంజీవ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నవ ప్రభాకర్, పసి, గుంటూరు గోపి, ప్రభాకర్, కుక్కల వాసు, జనసేన నాయకుడు జిడుగు తులసీ తదితరులు పాల్గొన్నారు.

జగ్గడిగుంటపాలెంలో రూ.1.36 లక్షలు..

తెనాలిరూరల్: మండల పరిధిలోని జగ్గడిగుంటపాలెంలోని ప్రగడకోటయ్య నగర్ పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో 29వ గణపతి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజైన గురువారం విఘ్నేశ్వరుడి నిమజ్జన కార్యక్రమంలో భాగంగా లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రాచాబత్తుని విజయ్‌కుమార్ రూ. 1.36 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు. కొలకలూరు గ్రామంలోని బీసీ కాలనీలో కులమతాలకు అతీతంగా ఏటా వినాయకుని ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. లడ్డు వేలం నిర్వహించి ఊరేగింపుగా కొమ్మమూరు కాల్వ వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నూతక్కి స్వరాజ్ వర్మ, నూతక్కి అవినాష్, గమ్మిడి రామకృష్ణ, కుమార్, సురేష్, కామేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



లడ్డు వేలం వేస్తున్న పద్మశాలి యూత్ సభ్యులు

వరద బాధితులకు ఆపన్నహస్తం



శారద ఐటీఐ కళాశాల యాజమాన్యానికి మొక్కలు అందజేస్తున్న వెస్లీ ఫౌండేషన్ సభ్యులు

కొల్లూరు : వరదల వల్ల నిరాశ్రయులైన ప్రజలకు దాతలు ఆపన్న హస్తం అందిస్తున్నారు. కొల్లూరు మండలం ఈపూరులంక ఎస్సీ ఏరియాలో గురువారం అమెరికాకు చెందిన ఆల్‌బెనీ ఆంధ్ర అసోసియేషన్ సహకారంతో తెనాలికి చెందిన రెయిన్‌బో సంస్థ ఆధ్వర్యంలో ముంపు బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

పీహెచ్‌సీకి మందులు

రెయిన్ బో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆ సంస్థ సభ్యులు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యులు కావ్య, సంధ్యలకు ఈ మందులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ జీవన్‌లత, వరలక్ష్మి, సృజన, జ్యోతి, వెంకటేశ్వరమ్మ, కుమారి, మేరి, దనుంజయపాల్గర్ పాల్గొన్నారు.

■ వరద ముంపు బాధితులకు వెస్లీ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని శారద ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకట నారాయణ అన్నారు. వెస్లీ ఫౌండేషన్‌కు తన వంతుసాయంగా రూ.5వేలను గురువారం అందజేసి ఆ మొత్తానికి మొక్కలు తీసుకుని అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు జాన్ వెస్లీ పాల్గొన్నారు.

చేనేత, భజన కళాకారులకు..

భట్టిప్రోలు: కృష్ణానదీ పరీవాహక లంక గ్రామాలకు సంభవించిన వరదల వల్ల ఉపాధి కోల్పోయిన చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన చిలుకోటి లక్ష్మినారాయణ-వెంకటరత్నం దంపతులు ముందుకు వచ్చారు. కొల్లూరు మండలం జువ్వలపాలెంలో 17 చేనేత కుటుంబాలకు, అలాగే పెసర్లంక పల్లెపాలెంకు చెందిన 10 మంది భజన కళాకారులకు దుప్పట్లు, చీరలు గురువారం సీపీఎం నాయకులు అందచేశారు.

జూదరుల అరెస్ట్

కర్లపాలెం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కేసులు పెడతామని కర్లపాలెం ఎస్‌ఐ ఎస్.రవీంద్ర తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామంలోని తుంగభద్ర కాలువ కట్టపై బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న ముగ్గురిని కర్లపాలెం ఎస్‌ఐ తన సిబ్బందితో అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.2,330లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.







‘గొయ్యో’మొర్రో!

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈ రోడ్డు పెనుమూడి-ఓలేరు ప్రధాన రహదారి. ఈ దారిలో అడుక్కో గొయ్యి పడింది. ఫలితంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చాలా చోట్ల ఛిద్రమైంది. రేపల్లె నియోజకవర్గ వాసులు తెనాలి, కృష్ణా, బాపట్ల జిల్లాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన దారి. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీంతోపాటు బ్యాంక్ కెనాల్ పక్కనే ఈ రోడ్డు ఉండడంతో ప్రమాదాలు ‘దారి’కాచాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– రేపల్లె రూరల్

వరద బాధితులకు పలువురు వితరణ



నిత్యావసరాల కిట్లతో డాక్టర్ జీవనలత, సభ్యులు

తెనాలి: అమెరికాలోని అల్బనీ ఆంధ్రా అసోసియేషన్ తెనాలి ప్రాంతంలోని వరద బాధితుల సహాయార్థం నిత్యావసరాల కిట్లను స్థానిక రెయిన్‌బో ట్రస్ట్‌కు అందజేశారు. ఎన్నారై వెంకట శ్రీనివాస్ నిడమానూరు ప్రధాన దాత. ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.జీవనలత, సభ్యుల ఆధ్వర్యంలో గురువారం కొల్లూరు మండలం ఈపూరు లంక గ్రామంలోని 200 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 5 కిలోల బియ్యం, కందిపప్పు కిలో, మినప్పప్పు కిలో, నూనె లీటరు, గోధుమపిండి కిలో. పంచదార కిలోతోపాటు ఉప్పు, పసుపు, కారం అందజేశారు. సభ్యులు వరలక్ష్మి, జ్యోతి, సుజన, వెంకటేశ్వరమ్మ, మేరీ, కుమారి పాల్గొన్నారు. అదేవిధంగా రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ వరద ముంపునకు గురైన లంక గ్రామాల్లో జరుగుతున్న వైద్య శిబిరాలకు రూ.15 వేల విలువైన మందులను సమకూర్చారు. వీటిని కొల్లూరు పీహెచ్ వైద్యాధికారికి అందజేసినట్టు డాక్టర్ జీవనలత వివరించారు.



బాధితులకు చాపలు, ఆహార పొట్లాలు అందజేస్తున్న సినీ దర్శకుడు దిలీప్‌రాజా

ఆహార ప్యాకెట్లు పంపిణీ

పట్టణ చినరావూరుకు చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ సీఎల్ఎం ఇండియా అధ్యక్షుడు రావూరి ఆనంద బాబు ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలోని వరద బాధిత అన్నవరపులంక గ్రామంలో ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్‌ను గురువారం పంపిణీ చేశారు. గ్రామంలోని 500 మందికి వీటిని పంపిణీ చేసినట్టు తెలిపారు. దొప్పలపూడి శ్యాం, బుల్లా రమేష్, అద్దేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దిలీప్‌రాజా చేయూత

రేపల్లె రూరల్: ఇటీవల కురిసిన భారీవర్షాలకు నిరాశ్రయులైన బేతపూడి గ్రామ పొలిమేరల్లో నివశిస్తున్న నిరుపేద గిరిజనులకు సినీ దర్శకుడు దిలీప్ రాజా గురువారం చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా వీరికి చాపలు, ఆహార పొట్లాలు, మినరల్ వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జూలకంటి బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ ఇంటూరి విజయభాస్కర్ పాల్గొన్నారు.

వాస్తవ సాగుదారులకే పరిహారం ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వినతి

తెనాలి: ఈ-క్రాప్, కౌలు కార్డుతో నిమిత్తం లేకుండా పంట నష్టపోయిన వాస్తవ సాగుదారులకు పరిహారం అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రైతుసంఘం కమిటీ ఆధ్వర్యంలో గురువారం తెనాలి మండలం తేలప్రోలు, నేలపాడు సచివాలయాల కార్యదర్శులకు ఆ ప్రకారం వినతి పత్రం అందజేశారు. చేలో సాగుచేసిన పంట ఆధారంగా ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని, అది కూడా వాస్తవ సాగుదారులకే అందించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వివిధ బ్యాంకుల్లో గల రైతులు/కౌలురైతుల రుణాలకు వడ్డీ మాఫీ చేయాలని కోరారు.

అంతేకాకుండా రుణాలు వాయిదా వేసి రీషెడ్యూల్ చేయాలని రైతాంగం కోరుతున్నట్టు తెలిపారు.



తేలప్రోలు సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తిరిగి పంటలు వేసుకునేందుకు బ్యాంకుల నుంచి కొత్తగా రుణాలను ఇప్పించటం అత్యవసరమని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు పఠాన్ మహబూబ్ ఖాన్, ఘట్టమనేని కోటయ్య, తెనాలి శాంత కుమారి, వెలివెల ఏడుకొండలు, షేక్ జైనులబి, తెనాలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ పుస్తక విక్రయ సంస్థ శ్రీలలితా అండ్ కో అరవై వసంతాల ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలికల హైస్కూలులో గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పి.పురుషోత్తమ శర్మ శ్రీలలితా అండ్ కో విశిష్టతను వెల్లడించారు. ఉపాధ్యాయుల ప్రాధాన్యతపై ఎల్.లక్ష్మణరావు వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన తెనాలి మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ తన ప్రసంగంలో పుస్తక పఠనం, విద్య ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. స్కూలు ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ వేడుకలో అదే హైస్కూలుకు చెందిన ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయినులు సీహెచ్ లక్ష్మీప్రియ, వీవీ రాజ్యలక్ష్మి, జి.సంధ్యారాణి, జి.నాగవేణి, వి.పావనిలను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సత్కరించారు. కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సత్కారం పొందిన గురువులతో అతిథులు

పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత

సీడీపీవో లక్ష్మి పార్వతి



దోనేపూడిలో పౌష్టికాహార పదార్థాల గురించి అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ

కర్లపాలెం: పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత వస్తుందని బాపట్ల సీడీపీవో లక్ష్మీపార్వతి తెలిపారు. కర్లపాలెం మండలం బిడారుదిబ్బ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల చిన్నారులలో, కౌమారదశలో ఉన్న బాలికలలో ఎదుగుదల సక్రమంగా ఉండదని చెప్పారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలని ఆమె చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య మాట్లాడుతూ పాలు, గుడ్లు, పండ్లు ఆకుకూరలు, ఆహారంగా తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని షేక్ సైదాబీ, ఎంఎల్‌హెచ్‌పి షైనీ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.రాజకుమారి, డి.రమాదేవి, కె.రమాదేవి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పెనుగుదురుపాడులో..

వేమూరు(చుండూరు) చుండూరు మండలం వేటపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెనుగుదురుపాడులో పోష్టికాహర మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ పోలె కోటేశ్వరరావు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహరం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వి.స్నేహలత, అంగన్‌వాడీ కార్యకర్త జె.సునీత, మహిళా పోలీసు భువనేశ్వరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బ్యూలా, ఆశా కార్యకర్త మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మి పార్వతి



పెనుగుదురు పాడులో మాసోత్సవాలు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు

దోనేపూడిలో..

కొల్లూరు: పౌష్టికాహారంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ అమృతలూరు ఏసీడీపీఓ బి.వి జయరాణి చెప్పారు. గురువారం మండలంలోని దోనేపూడిలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ పి. నగరాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.